# ఆధ్యాత్మిక మార్గమునకు విశ్వాసమే పునాది

**త**ల్లి ఒడిలో నిర్విచారముగా, నిర్భయముగానున్న పసిపాపలను చూచిన, ఆనందము తాండవమాడుచున్న ఆ ముఖారవిందముయొక్క ప్రకాశమును, ప్రశాంతతను చూచిన ఎంత శాంతి! ఎంత సంతోషము! మానవునియొక్క శాంతి, ఆనందములను హరించే ఈర్ష్యాసూయలు, కామక్రోధములు, రాగద్వేషములు, అహంకార ఆడంబరములు పసిపాప హృదయమును చేరుటకు అవకాశము లేదు. భవిష్యత్తును గురించిన భయాందోళనలు పసిపాపకు లేవు. మిన్ను విరిగి పైన పడినను దాని శాంతికి భంగము కలుగదు. తల్లి ఒడిలో నిర్భయముగా, ఆనందముగా పడుకొనియుండును. ఇట్టి శాంతి, ఆనందములు పెద్దవారికి లేవే! కారణమేమిటి? పెరిగి పెద్దవారయ్యేకొద్దీ ఇంద్రియములకు లోబడి జీవితమందు అనేకత్వమును అభివృద్ధి చేసుకొని అశాంతిని అనుభవిస్తూ నిర్మలత్వమును కోల్పోయి బలహీనతలకు బానిసలై దుఃఖమే అధికమగును. పెద్దవారి దృష్టి దృశ్యకల్పితమైన జగత్తుపైనే ఉండును. క్షణమాత్రము దొరకే ఆనందము నిమిత్తమై నిరంతర తాపత్రయముతో, అంతులేని ఆత్రుతలో పడి ఇంద్రియములవెంట పరుగెత్తి జీవితమును వ్యర్థము గావించుకొందురు. తెలివితేటలు పెరిగినకొలదీ ఏకత్వమునందు అనేకత్వమే గోచరమగును. 'ముండే ముండే మతిర్భిన్నాః' అన్నట్లు, భేదభావాలు, భిన్నాభిప్రాయాలు, ఊహాచిత్రాలు అధికమై పవిత్రత, దివ్యత్వము, ఏకత్వము మొదలగు దివ్య గుణములు తగ్గును. ఏకస్వరూపముగా ఉండిన దేహమును ఉదరము, హస్తము, నేత్రము, శ్రోత్రము అని వేరు చేసి అనేకత్వదృష్టిచే శుశ్రూషించిన లాభము లేదు. వీటియొక్క సమ్మిళిత సంబంధమును గుర్తించి వర్తించే అవసరమున్నది.

దేహము, వ్యక్తులు, జీవులు మూడింటియొక్క సమ్మిళితమైన స్వరూపమే ఆత్మ. సంకుచిత భావముతో నూతన పరిశోధనామార్గములను అవలంబించి చిక్కిన అల్పఫలితములకు విజ్ఞాన శాస్త్రజ్ఞులు పెద్ద జయమును పొందినామని భ్రమించుచున్నారు. చిన్నచిన్న ఫలితములవలన వారి బుద్ధి యొక్క చిన్నతనముకూడా పెరుగుతూ ఉండును. వైద్యులు ఎముకలు, చెవి, ముక్కు, గొంతు, హృదయము, కడుపు, చర్మము అని దేహమును ముక్కలుగ చేసి ప్రత్యేకముగ వాటివాటికి తగిన పరిహారములను విధింతురు.

భక్తులు కూడా ఇంతే. వారిలో ఎక్కువమంది యుక్తులు, భుక్తులు. ఒకరికన్న మరొకరు అజ్ఞానముతో "నా దేవుడు, నీ దేవుడు", "గణపతి పెద్ద, హనుమంతుడు పెద్ద" అని భిన్నాభిప్రాయాలను పెంచుకొని కలహింతురు. దీనికి తోడు పరమాత్ముడు కూడా 'ఏకోహం బహుశ్యాం' అని మానవునికి దివ్యత్వమును భిన్నభిన్న రూపములలో చూపించును. అనుభవజ్ఞులైన పెద్దలు మాత్రము మానవులందరిలోనూ ప్రకాశించుచున్న దివ్యత్వమును గుర్తింతురు.

**ఆధ్యాత్మిక మార్గమునందు విశ్వాసము చాలా ప్రధానము**

ఆధ్యాత్మిక మార్గమునందు నమ్మకము చాలా ప్రధానము. జనన మరణములమధ్య పతనమైన అనుభవములనందుకొని మానవుడు నమ్మరాని వాటిని నమ్ముతున్నాడు. నమ్మదగిన దానిని నమ్మడం లేదు. వివేక విచక్షణలను కోల్పోయి బాధపడుచున్నాడు.

అమ్మ ఒడిలోని పాప అమ్మపై ఉన్న నమ్మకమువలన 'అతడు నా తండ్రి, ఇతడు నా తాత. ఈమె అక్క' అని

అమ్మ చూపించిన వ్యక్తులను ఆ పేరుతోనే పిలుచును. 'ఇతడు నీ తండ్రి' అని తల్లి చెప్పిన మాటను నిర్మల, నిశ్చల, నిస్వార్థ బుద్ధితో విశ్వసించును. తల్లి చెప్పకుండిన తండ్రి ఎవరని వేరెవరు చెప్పగలరు? అట్లనే, ప్రకృతి మాతకూడా 'సృష్టికర్త ఒకడున్నాడు, అతడే జగత్పతి' అని చెబుతూ ఉంటే ఆమెను విశ్వసించక 'ఉన్నాడా, లేడా' అనే వాదోపవాదములను పెంచుకుంటూ పోతున్నారు.

మనము అన్నింటినీ విశ్వాసముతోనే చేయుచున్నాము. ఒక మంగలి వాడి దగ్గరికి పోయి అతని దగ్గర పదునైన కత్తి ఉందని తెలిసి, వెనుకకు తిరిగి రాము. 'అతడు అపకారము చేయడు', అనే విశ్వాసముతో అతని చేతికి మన తలను అందిస్తున్నాము. ప్రతి వాడు తాను పరులను విశ్వసించియే ఆనందమును అనుభవించుచున్నాడు. చాకలి మన వస్త్రములను శుభ్రపరచి, ఇస్త్రీ చేసి ఇస్తాడని విశ్వసించి కదా విలువైన గుడ్డలను అతనికి ఇస్తున్నాము. అట్టి విశ్వాసము లేకపోయిన మన గుడ్డలు పరిశుద్ధము కావు కదా! అట్లనే, దేహిని విశ్వసించి, ఆనందమును అందుకోవాలి. దీనిలో అనుకరణము తప్పు. పరుల మాట నమ్మకూడదు, తామే స్వయంగా అనుభవించాలి, అని భ్రాంతి పడుతున్నారు. మాతృమూర్తిపై విశ్వాసము వలన తండ్రి అని ఒకరిని నమ్మినట్లు, ప్రకృతిలో సర్వవ్యాపకమై ఉన్న శక్తిని దివ్యత్వమని విశ్వసించాలి. ఎక్కడో జరిగిన విషయమునుగురించి పత్రికలలో వార్త వచ్చిన దానిని చూడకనే, ప్రత్యక్షముగా గుర్తించకనే ఆ ఎడిటరుపై విశ్వాసముచే మంచి విషయ ముంటే ఉప్పొంగిపోతున్నాము. లేకపోతే, క్రుంగిపోవుచున్నాము.

**చిత్తశుద్ధి, ఇంద్రియ నిగ్రహములుంటే దైవానుగ్రహము తప్పక లభించును**

కథా రచయితలు రాసే కథలలోని ఉల్లాసముగాని, లేక నిరాశా నిస్పృహలుగాని చదువరులనూ ప్రభావితము చేయుచున్నవి. రుచికరమైన సినిమాలు చూపించే కల్పనలను సత్యముగా భావించి జాలి, విచారము, భయము, ఉద్రేకము, ఉల్లాసము ఇట్టి రకరకాల భావములు మనలో ఆవిర్భవించును. సినిమా డైరెక్టర్ని, ఎడిటర్ని, కథలు రాసేవారిని నమ్ముతారే గాని, రక్షించి శిక్షించి పెంచి పరిపాలించే జగదీశ్వరుని నమ్మకున్నారు. మాటల మేజిక్కుకు లొంగుతారేగాని మంత్రములను నమ్మి హృదయములోని దివ్యత్వమును కనుగొనుటకు ప్రయత్నింపరు. ఒక్క మాట ఎన్నటికీ నిజమైనది. నమ్మి చెడినవారు ఏనాడూ లేరు. భగవంతుని విశ్వసించి శాంతి, సంతోషములతో జీవితమంతా ఆనందముగా గడిపిన కోటానుకోట్లు భారతీయులు గలరు. నాస్తికత్వము విప్లవకారి. అయితే, ఆస్తికత్వమును అభివృద్ధి చేయుటకొరకే నాస్తికత్వము వచ్చినమాట నిజము. చీకటి లేకపోయిన వెలుతురుకు విలువ లేదు కదా! ఆకలి లేకపోతే అన్నమును ఎవరు ఆశించుదురు? మరణమే లేకపోతే తల్లికూడా తన బిడ్డను ప్రేమించదు. దీనికంతకీ స్వార్థమే మూలకారణము. ఆశలు నెరవేర కుండిన దైవముపై ద్వేషభావము. కనుక, స్వార్థరహితమైన మార్గమును అనుసరించిన దివ్యానుగ్రహము తప్పక కలుగును. 'అడుగకువే ఓ మనసా!' అన్నట్లు అర్హతను సంపాదించిన చాలు; కోరనక్కర్లేదు. శబరి దేనిని అడిగినది? పవిత్రత, యోగ్యత రెండూ ఉంటే భగవంతుడు తానే మీవద్దకు నడచి వస్తాడు. చిత్తశుద్ధి, ఇంద్రియ నిగ్రహములుంటే దైవానుగ్రహము తప్పక అబ్బును. సుఖశాంతులను అందుకోవచ్చును. దీనికి ఏమాత్రము సందియము లేదు. నిజమైన ఆనందము బాహ్య ప్రపంచమునందు దొరకదని తెలియక కాలమును, కాయమును వ్యర్థము చేయుచున్నారు, మానవులు. కుటుంబ పోషణలో, బంధుమిత్రుల ఆదరణలో సుఖము లేదు. తన హృదయమందే దాగి వుంది. కుటుంబ వ్యామోహమువలన ఎంతోమంది పెడమార్గములో పడి జార, చోరులుగా తయారగుచున్నారు. దేహభ్రాంతి ఉన్నంతవరకు బలహీనత తప్పినది కాదు. దేహిస్వరూపమే అర్థించాలి, ఆరాధించాలి, ఆనందించాలి.

**భగవంతుడు భక్తసులభుడు**

యోగశక్తి, క్రియాశక్తి, ఆత్మశక్తి ఇవి మూడూ సమ్మిళితమైనదే అవతార తత్త్వము. అవతరణ మనిన పైస్థానమునుంచి క్రింది స్థానమునకు రావడమని కాదు అర్థము. గుణస్వరూపుడైన మానవుని ఉద్ధరించుటకు భగవంతుడు గుణస్వరూపుడుగనే రావలెను. దీనివలన భగవత్తత్త్వమునకు కించిత్వమును ఏమాత్రము ఆరోపించకూడదు. చంటిబిడ్డ ఏడ్చినప్పుడు తల్లి చేతిలోనికి ఎగురుట దానికి సాధ్యము కాదు. 'నేను పెద్దదాన్ని' అని తల్లి వంగును. వంగిన మాత్రమున లొంగినట్లు కాదు. మానవుడు పైకి ఎగురుట సాధ్యం కానప్పుడు సాయిమాత వంగి ఎత్తుకొని సంతోషము నందించును. ఏరో ప్లేను ఎప్పుడూ పైనే ఎగురుటకు ప్రయత్నించును. ఇతర వాహనాదుల వలె నేలపైన సంచరించదు. అయితే, అక్కడక్కడ దానిలో ప్రయాణించుటకు అర్హత సంపాదించినవారిని ఎక్కించుకొని తిరిగి పైకి వెళ్ళును. భగవంతుడు గుణాతీతుడు. ఎక్కడో ఉన్నాడు, దొరకడని లేదు. భగవంతుని పొందే అర్హత కలిగినవారందరికీ ఆనందము నిచ్చే నిమిత్తమై తాను భక్తసులభునిగా ఉంటాడు. తరువునుండి పక్వఫలం వేరయ్యేరీతి జ్ఞానులందరూ తరింతురు. ఐతే, సంచితానికి వడ్డీ పెంచుకొని దుష్కర్మలతో దుఃఖమును పెంచకూడదు.

**భగవత్తత్త్వమునకు ఎప్పుడూ ఆనందమే!**

మీ హృదయమునందు మీరెప్పుడు దివ్యమైన ఆనందమును అందుకొందురో అదే సాయి పుట్టిన దినము. ఇంకొక సత్యము ఈనాడు మీకు వెల్లడించాలి. 'పుట్టపర్తిలో పండుగ చేస్తున్నారు కాబట్టి, మేము వస్తున్నాము' అని భావించిన అది సరికాదు. మీరు రావడంచేత పుట్టిన పండుగ చేస్తున్నాము, అంతే! పుట్టిననాడు పండుగ చేసుకోవాలి – అనే ఆశలు నాకు ఏనాడూ లేవు. అనేక దేశాలనుండి ఎన్నో కష్టనష్టాలకు గురియై మీరు రావడంచేత మీకు ఆనందమునందించాలనే భావమే తప్ప నాలో ఇట్టి చిల్లర భావాలు ఏనాడూ ఆవిర్భవించవు. 'లోకాస్సమస్తా స్సుఖినో భవంతు' అనే విశ్వస్వరూపాన్ని గుర్తించి, అందరికీ సంతోషము, సంతృప్తి కలగాలనే భావము, ఉత్సాహము, ఆవేదన మీ హృదయములో ఏనాడు పుట్టునో ఆనాడు మీ హృదయము సాయిమందిరముగా విరాజిల్లును. ఆనాటినుండి మీరెక్కడో నేనక్కడ. ఈ దినము ఉదయమునుండి నా దగ్గరకు వచ్చినవారెందరో 'హేపీ బర్త్ డే' అన్నారు. నా హేపీ బర్త్‌డేకి మీరు రానక్కర్లేదు. నేను నిరంతరము హేపీగానే ఉన్నాను.

**'నిత్యానందం పరమ సుఖదం కేవలం జ్ఞానమూర్తిం**
**ద్వంద్వాతీతం గగన సదృశం తత్త్వమస్యాది లక్ష్యం**
**ఏకం నిత్యం విమలం అచలం సర్వధీ సాక్షిభూతం**
**భావాతీతం త్రిగుణరహితం....'**

అట్టి భగవత్తత్త్వమునకు ఎప్పుడూ ఆనందమే. ఎప్పుడూ హేపీయే!